మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- అర్హులందరికీ పథకాలు చేరాలి
- గ్రామాల అభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత
- రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**పాన్‌గల్, అక్టోబరు 3 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి అలాగే ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అభి వృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ సర్కార్ పనిచేయ డమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. శనివారం పానుగల్ మండ లంలో వివిధ గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. పానుగల్ మండలంలోని తెల్లరాళ్ళపల్లి తాండా ,తెల్లరాళ్లపల్లి, వెంగలాయిపల్లి, బండపల్లి, అన్నా రం, దవాజిపల్లి గ్రామాలలో రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనాలకు భూమి పూజ చేశారు. తెల్లరాళ్లపల్లి, శాఖాపూర్‌తండా, వెంగళా యిపల్లి, జమ్మాపూర్, దావాజీపల్లి ,రేమొద్దుల గ్రామాలలోరూ.12లక్షలతో, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. చిక్కేపల్లి, మాధవరావుపల్లి, కిష్టాపూర్ తాండ గ్రామాల లో నూతన గ్రామపంచాయతీ భవనాలను మంత్రి జూపల్లి ప్రారంభించారు. నిజామా బాద్, బండపల్లి, కొత్తపేట గ్రామాలకు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు 20 లక్షలు నిధులు మంజూరు కావడంతో భూమి పూజ చేశారు. పానగల్ మండల కేంద్రంలో మొత్తం రూ.50 లక్షల నిధులతో గోదాం, మండల మహిళా సమాఖ్య భవనానికి రూ.12 లక్షలు నిధులు మంజూరు కావడంతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుంద న్నారు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిం చడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో మహనీయుల విగ్రహాలను స్ఫూర్తి దాయకంగా ఏర్పాటు చేయాలన్నారు. తనవం తుగా తెల్లరాళ్లపల్లి తండాకు వయోజన విద్య కోసం పదివేల రూపాయలను, మహనీయుల విగ్రహాలకోసం రూ.25 వేలను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, డిఆర్డీఓరామ్ మహేశ్వర్‌రెడ్డి, డిటి అశోక్ కుమార్, ఎంపిడిఓ గోవిందరావు, ఎపిఎం శ్రీని వాసులు, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జయమ్మ, కార్యదర్శి మల్లీశ్వరి, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవి కుమార్, మాజీ సింగిల్ విండో వైస్ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జయరాములు సాగర్, పుల్లారావు, రాము యాదవ్, బ్రహ్మం, వివిధ శాఖల అధికా రులు, వివిధగ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు : మంత్రి జూపల్లి

**కొల్లాపూర్‌లో రూ.2.50 కోట్లతో ఎస్టీ బాలుర వసతిగృహ నిర్మాణానికి మంత్రి జూపల్లి శంకుస్థాపన**

**కొల్లాపూర్, అక్టోబరు 3,ప్రభాతవార్త:** గిరిజన విద్యా ర్థులకు మెరుగైన విద్యా వసతులు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎస్టీ బాలుర వసతిగృహం నూతన భవనానికి శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరి జన విద్యార్థులు విద్యలో ముందుకు సాగేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. విద్యార్థుల చదువుకు అనుకూలమైన వాతావరణం, సురక్షితమైన వసతి, నాణ్యమైన మౌలిక సదు పాయాలు అందుబాటులో ఉంటే వారు మరింత మెరుగ్గా విద్యనభ్యసించగలరని అన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని.. గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలను మెరుగు పరిచి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయ డమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొ న్నారు. హాస్టళ్లలో భవనాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను మెరు గుపరిచేందుకు అవసరమైన

-మిగతా4లో..



ఎస్టీ బాలుర వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి

# మహబూబ్‌నగర్ రూపురేఖలు మారుస్తాం

- ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- వివిధ డివిజన్లలో రూ.2.33 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అంబటిపల్లిలో రూ. 50 లక్షలతో వీడీసీసీ రోడ్డు, ఎదిరలో రూ. 80 లక్షలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం
- 24, 25 డివిజన్లలో వరద ముంపు నివారణకు రూ. 1.03 కోట్లతో డ్రైనేజీ నిర్మాణాలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మహ బూబ్‌నగర్ నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ వంతంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన రూ. 2.33 కోట్ల విలువైన అభి వృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభో త్సవాలు చేశారు. డివిజన్ల వారీగా అభివృద్ధి పనుల వివరాలు 4వ డివిజన్ (అంబటిపల్లి): ప్రజల చిరకా ల డిమాండ్‌ను పరిష్కరిస్తూ రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాణ్యమైన వీడీసీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. 5వ డివిజన్ (ఎదిర): కాలనీవాసుల రాకపోకల సౌకర్యార్థం రూ. 80 లక్షలతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. 24వ డివిజన్: వర్షాకాలంలో ముంపు సమస్య తలెత్తకుండా రూ. 71 లక్షలతో నూతన స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, అలాగే ఇప్పటికే రూ. 24 లక్షలతో పూర్తి చేసిన డ్రైన్ ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. 25వ డివిజన్: రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న స్టామ్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

-మిగతా4లో..

### భూ సమస్య పరిష్కారం కాకపోవడంతో

# రైతు ఆత్మహత్య

- కోయిల్‌కొండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఘటన
- చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న పార్వల్లి గ్రామానికి చెందిన రైతు

**కోయిల్ కొండ అక్టోబర్ 3, ప్రభాతవార్త :** కోయిల్‌కొండ తహశీల్దార్ కార్యాలయ ఆవర ణలో శనివారం చోటుచేసుకున్న రైతు పసుల లావప్ప (50) మృతి ఘటనపై కోయిల్‌కొండ తహశీల్దార్ జి.దీపక్‌రావు వివరాలు వెల్లడిం చారు. కోయిల్‌కొండ మండలం పార్వల్లి గ్రామానికి చెందిన పసుల లావప్ప తహశీల్దార్ కార్యాలయ ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు తహశీల్దార్ తెలిపారు. ఉదయం సుమారు 6.30 గంటలకు ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకుని నిబంధనల ప్రకారం ప్రాథమిక విచారణ చేపట్టిన అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహ బూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. భూ వివాదంపై కుమారుడి వాంగ్మూలం మృతుడి కుమారుడు పసుల కురుమూర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, పార్వల్లి శివారులోని సర్వే నంబర్ 211లోని వ్యవసాయ భూమికి సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా వివా దం కొనసాగుతున్నట్లు తహశీల్దార్ తెలిపారు. దయ్యాలి లక్ష్మయ్య, పసుల చంద్రశేఖర్, పసుల విష్ణు, దయ్యాల రామకృష్ణ అనే వ్యక్తులు వ్యవసాయ భూమిలోకి ప్రవేశించి హద్దు రాళ్లను తొలగించేందుకు ప్రయత్నిం చడం, పంటకు నష్టం కలిగించడం, తన తండ్రిపై దాడికి ప్రయత్నించడం, బెదిరిం పులకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు తెలిపారు. అదే విధంగా, మృతుడు రాసినట్లు పేర్కొంటున్న సూసైడ్ నోట్‌లో కొందరి పేర్లు ఉన్నట్లు పోలీ సుల దృష్టికి వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఆ నోట్‌లో పేర్కొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు పోలీసులను కోరినట్లు వివరించారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలం,

-4లో..



చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు లావప్ప

# సర్ పేరుతో ఓట్ల తొలగింపు

- ఈసీపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫైర్
- వనపర్తిలో 35 వేలకుపైగా ఓట్లు తొలగించారని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆరోపణ
- సిఈసి జ్ఞానేష్‌కుమార్ రాజీనామాకు డిమాండ్
- సర్‌పై అఖిలపక్షం తీవ్ర ఆగ్రహం
- దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపు




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తి నియోజకవర్గంలో సుమారు 2.75 లక్షల మంది ఓటర్లు ఉండగా..35 వేలకుపైగా ఓట్లను తొలగించారని మేఘారెడ్డి ఆరోపిం చారు. మరికొందరికి నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాల్సిన ఎన్నికల సంఘం తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. సర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడిందని అ ఖిలపక్ష నేతలు ఆరోపించారు. ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకో వాలని, జాబితాలో జరిగిన మార్పులపై పూర్తి వివరాలను రాజకీయ పార్టీలకు, ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణలో ఎన్నికల సంఘం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఇదిలా ఉండగా సర్ అనంతరం జాబితాల నుంచి మిగిలిపోయిన అర్హులైన ఓటర్లను గుర్తించి తిరిగి చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఈసీ రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశిం చింది. ప్రీ సర్ జాబితాలో పేరుండి ప్రస్తుత జాబితాలో కనిపించని ఓటర్లతోపాటు తొలి సారి ఓటు హక్కు పొందే యువతను ఈ ప్రక్రియలో చేర్చాలని సూచించింది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయినట్లు తేలితే బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిఇసి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని పట్టు బట్టారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని నేతలు ప్రకటించారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రజలను చైతన్యవంతం చేస్తా మని, యువతను భాగస్వామ్యం చేస్తూ ఉద్య మాన్ని విస్తరిస్తామని తెలిపారు. అవసరమైతే ఢిల్లీలోనూ భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపులపై పూర్తి పారదర్శకత ఉండాలని అఖిలపక్ష నేతలు కోరారు. సర్ ప్రక్రియలో అభ్యంతరాలు ఉన్న ఓటర్లకు తగిన అవకాశం కల్పించి, వారి పేర్లు తిరిగి పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనందున..అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా

-మిగతా4లో..

# కేజీబీవీలో వరస పంచాయితీలు

- వంట మనుషులతో వాగ్వాదం
- వంటలు చేయకపోవడంతో స్పృహతప్పి పడిపోయిన విద్యార్థులు
- రేవల్లి ఆసుపత్రికి తరలింపు..చికిత్స పొందుతున్న విద్యార్థులు
- రాత్రి సమయంలో కేజీబీవీ దగ్గర తల్లిదండ్రులు

4లో..



రేవల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేజీబీవీ విద్యార్థులు

## రోకలి బండతో భార్యను హతమార్చిన భర్త..?

### ధరూర్ మండలం ఓబులోనిపల్లిలో దారుణం

**గద్వాల, అక్టోబరు3, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఓబులోని పల్లి గ్రామంలో దారుణ ఘటన చోటు చేసు కుంది. గ్రామానికి చెందిన జమ్ములమ్మ అనే మహిళను ఆమె భర్త గోపి రోకలి బండతో దాడి చేసిహత్య చేసినట్లు సమాచారం. భార్యా భర్తల మధ్య జరిగిన వివాదమే ఘటనకు కారణమా?ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలను సేకరిస్తు న్నట్లు సమాచారం. జమ్ములమ్మ మృతికి గల అసలు కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.



రక్తపు మడుగులో మృతురాలు జమ్ములమ్మ

# ఎంబీ మెడికల్ సెంటర్ భూములను పరిరక్షించాలి

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- భూముల వివాదాన్ని చట్టబద్ధంగా పరిష్కరించాలి
- బలవంతపు చర్యలు, ఆస్తుల నష్టానికి తావివ్వొద్దు
- మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**జడ్చర్ల, అక్టోబరు 3, ప్రభాతవార్త:** జడ్చర్ల కేంద్రంగా దశాబ్దా లుగా పేదలకు వైద్య సేవలు అందించిన ఎంబీ మెడికల్ సెంటర్ భూములను పరిరక్షించి, మెడికల్ కాలేజీ ఆశయాన్ని నెరవేర్చాలని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. భూములను రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా చూడాలని కోరారు. శని వారం జడ్చర్లలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాతో పాటు కర్నూలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పేదలు ఇక్కడ వైద్య సేవలు పొందేవారని, లక్షలాది మందికి సేవలందించిన ఈ సంస్థను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పటి డైరెక్టర్ డా. అర్నాల్డ్ మెడికల్ కాలేజీ ఏర్పాటు ఆలోచనను ముందుకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఎంబీ మెడికల్ సెంటర్‌కు సంబంధించిన భూముల విషయంలో బ్యాంకులు, సంబంధిత వర్గాల మధ్య న్యాయ పరమైన వివాదాలు కొనసాగుతున్నాయని, ఈ ఆస్తి వ్యక్తిగత వ్యక్తులకు మాత్రమే కాకుండా ఎండీ క్రిస్టియన్ అసోసియేషన్ కు సంబంధించినదని తాము భావిస్తున్నామని అన్నారు. ఈ సంస్థ దళిత క్రైస్తవ సమాజానికి సామాజికంగా, ఆధ్యాత్మి కంగా ప్రత్యేక అనుబంధం కలిగినదన్నారు. భూములను రియల్ ఎస్టేట్ కు వినియోగించే ప్రయత్నాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించి స్పష్టత ఇవ్వాలని కోరారు. భూమిపై హక్కు తమదేనని పేర్కొంటున్న వర్గాలకు హైకోర్టు ఆదేశాల మేరకు రక్షణ కల్పి స్తున్నామని పోలీసులు చెబుతున్నారని, కోర్టు ఆదేశాల అమలు విషయంలో పోలీసుల పాత్రపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు.

**ఎంబీ మెడికల్ సెంటర్ భూముల వివాదాన్ని చట్టబద్ధంగా పరిష్కరించాలి : మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి**

ఎంబీ మెడికల్ సెంటర్‌కు సంబంధించిన భూముల వివాదాన్ని చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించాలి తప్ప బలవంతపు చర్య లకు, ఆస్తుల నష్టానికి తావివ్వకూడదని మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎంబీ మెడికల్ సెంటర్ వద్ద పరిస్థితులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భూమికి సంబంధించి వివిధ వర్గాలు తమ తమ వాదనలు వినిపి స్తున్నాయని, బ్యాంకులు, సంబంధిత సంస్థల నుంచి కూడా తమకు అందిన సమాచారాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే న్యాయ పరమైన ప్రక్రియ కొనసాగుతున్న నేప థ్యంలో అన్ని వర్గాలు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఎంబీ మెడికల్ సెంటర్‌కు దశా బ్దాల చరిత్ర ఉందని, సుమారు 150 సంవత్స రాల క్రితం ప్రారంభమైన ఈ సంస్థ ద్వారా వేలాది మంది పేదలకు వైద్యసేవలు అందా యని ఆయన పేర్కొన్నారు.

-మిగతా4లో..

# ఆయిల్‌ఫామ్ సాగుతో మెరుగైన ఆదాయం

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్
- సాగు విధానం, నీటి లభ్యతపై కలెక్టర్ ఆరా

**అచ్చంపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త:** ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలి పారు. శనివారం అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి గ్రామంలో రైతులు శ్యాంసుందర్ రెడ్డి, హనుమంత రెడ్డి తమ 8 ఎకరాల వ్యవసాయ భూమిలో ఆయిల్‌ఫామ్ సాగు కోసం తీసుకువచ్చిన 400 మొక్కలను ఏర్పాటు చేస్తున్న విధానాన్ని అచ్చం పేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా తో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆయిల్‌ఫామ్ సాగుకు అవసరమైన నీటి లభ్యత, మొక్కల నాటే విధానం, మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, ఇప్పటి వరకు అయిన వ్యయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌ఫామ్ సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పోలి శెట్టిపల్లి క్లస్టర్ రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో

-మిగతా4లో..



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

# జెన్‌జీ ఉద్యమాలలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు

**ఆత్మకూర్ అక్టోబర్ 3, ప్రభాతవార్త:** దేశ రాజకీయాలను తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న జెంజి ఉద్యమాలలో విద్యా ర్థులు భాగస్వాములు కావాలని తెలంగాణ రాజాధికార పార్టీ అధ్యక్షు లు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండల కేంద్రంలో తీన్మార్ మల్లన్న రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో కొన సాగుతున్న పాదయాత్రలో భాగంగా శనివారం రోజు పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులతో తీన్మార్ మల్లన్న పలు విషయాలపై ముచ్చటించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ దేశ, మరియు రాష్ట్ర రాజకీయాలను ప్రక్షాళన చేసేందు కుగాను విద్యార్థిని విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే విద్యను అభ్యసించకుండా రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ఇదే సరైన మార్గమని ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సూచిం చిన విధంగా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్యార్థులు మాత్రమే అన్నయ్య విషయాన్ని గుర్తించి ప్రస్తుత కూలిన

-మిగతా4లో..



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు ఉపాధ్యాయ బృందం

## ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**జడ్చర్ల అక్టోబరు 3, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ జడ్చర్ల మండల కన్వీనర్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈసమావేశంలో రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్ర ఓటర్ల నమోదు, పార్టీ కార్యకర్తల సమన్వయం, గ్రామాల వారీగా కార్యక్రమాల నిర్వహణ, అర్హులైన పట్టభద్రులకు ఓటరునమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కోకన్వీనర్ శ్రీ భరత్‌భూషణ్,అసెంబ్లీ కన్వీనర్ శ్రీముచ్చర్ల జనార్దన్, మండల అధ్యక్షులు యాట రామకృష్ణ ముదిరాజ్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్‌గౌడ్ మండల ప్రధాన కార్యదర్శి చక్కని మల్లేష్ యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ జిల్లా నాయకులు ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ జిల్లా సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు రమేష్ జి ఓబీసీ మండల అధ్యక్షులు శివకుమార్ యాదవ్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బరిగని శ్రీశైలం ముదిరాజ్ బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్ బీజేవైఎం మండల అధ్యక్షులు గణపతి గుప్తా చిన్న పల్లి శివశంకర్ రెడ్డి మండల నాయకులు రమేష్ గౌడ్ రమేష్ జీవన్ ధనుంజయ్ తిరుపతి వెంకటేష్ విష్ణువర్ధన్ కార్యకర్తలు మరియు గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు.

## ఉప్పునుంతలను కరువు మండలం ప్రకటించాలి

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డిమాండ్**

**ఉప్పునుంతల, అక్టోబరు 3 ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్ష బావ పరిస్థితుల్లో అనుకూలంగా వర్షాలు లేక తాగు, సాగు నీరు అందడం లేదని, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా అందే నీరు సరిగా రాకపోవడంతో పంటల దిగుబడి వచ్చే అవకా శాలు లేకపోవడంతో ఉప్పునుంతల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని భారత రాష్ట్ర సమితి ఉప్పునుంతల మండల అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు పంట నష్టం కింద రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పంటల పరిస్థితి పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలం గా ప్రకటించే విధంగా అధికారులు నివేదిక తయారు చేయాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు సకాలంలో భోజనం అందించాలి



ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**మద్దూరు,అక్టోబరు 3 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందకపోవడంపై వచ్చిన వార్తల నేపథ్యంలో శనివారం ఎంపీడీవో, భార్గవరామ్, ఎంఈఓ జనార్దన్ రెడ్డి, పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి అల్పాహారం, భోజనం, పౌష్టికాహారం అందుతున్న తీరుపై వివరాలు తెలుసుకున్నారు. వంట ఏజెన్సీ నిర్వాహకుడితో మాట్లాడిన అధికారులు విద్యార్థులకు సకాలంలో అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు. వంట కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో సమస్య తలెత్తినట్లు తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులు పస్తులు ఉన్నట్లు మళ్లీ ఫిర్యాదులు వస్తే సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన నాయకులు

**శ్రీరంగాపూర్,అక్టోబరు3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన గుంపనిపల్లి ఎల్లమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 90 వేల చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు.వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తుడిమేఘారెడ్డి ఆదేశాల మేరకు ఈ చెక్కును అందజేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రెడ్డిచర్ల శ్రీహరి రాజు, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణు ముదిరాజ్, టౌన్ అధ్యక్షులు కుమ్మరి గోవిందు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఎల్లమ్మకు రూ.90వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండు ద్వారా 90 వేల రూపాయల ఆర్థిక సహాయం అందడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బహుజన రమేష్, టైలర్ అంజి, రామరాజు, ఆరవ వార్డు సభ్యులు రాజ్యలక్ష్మి ్మ , శ్రీరంగాపూర్ మండల యూత్ ప్రెసిడెంట్ గంగాధర్, మాజీ వార్డు మెంబర్ ఆంజనేయులు, పసుల రాజ వర్ధన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవికుమార్, లక్ష్మణ్, కురుమన్న, టైలర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ గవర్నర్ పర్యటనలో సేవా కార్యక్రమాలు..




చీరలు, మాస్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి,అక్టోబర్ 3 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని వాసవి క్లబ్ కేసిజిఎఫ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ గవర్నర్ పర్యటన సందర్భంగా శనివారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చీర లు, మాస్కులు, టవల్స్‌లను మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్‌లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ కలిమిచెర్ల రమేష్, స్రవం తి, పురపాలక సంఘం చైర్మన్ బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్‌లు మాట్లాడుతూ ప్రతి నిత్యం పారిశుధ్యం పని చేస్తున్నా, మనకు సేవ చేసే కార్మికులను చేయుత నివడం ఎంతో అభినందనీయమన్నారు. మహిళ కార్మికులకు చీరలు, పురుషులకు టవల్, మాస్కులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు ఇలా పారిశుధ్య కార్మికులకు ఈ రకంగా సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కల్వకుర్తి కేసిజిఎఫ్ అధ్యక్షుడు బాదం హరిష్, ప్రధాన కార్యదర్శి గోవిందు సంతోష్,వనిత అధ్యక్షురాలు బాదం సాయి లక్ష, గోవిందు మోనిక, వాసవి క్లబ్ సభ్యులు కోటష్,వనిత క్లబ్ సభ్యురాలు పురపాలక సంఘం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన సర్పంచ్

**ఉప్పునుంతల,అక్టోబరు3 ప్రభాతవార్త :**మండల కేంద్రమైన ఉప్పునుంతలలో గ్రామసర్పంచ్ చింత గాళ్ళశ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రా మంలోడ్రైనేజీలలో పేరుకపోయిన చెత్త చెదారాన్ని జెసిబి యం త్రంతో తొలగించారు.కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో గ్రామసర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు పరిశీలిం చారు.గ్రామప్రజలు గమనించి చెత్తచెదారాన్ని డ్రైనేజీల్లో వేయకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యం లో చెత్తకోసం కాలనీలకు ట్రాక్టర్ వచ్చినప్పుడు దాంట్లో చెత్తవేయాలని సర్పంచ్ సూచించారు. ఉ ప్పునుంతల నుంచి సదగోడు వెళ్లెమార్గంలో చెత్తను రోడ్డుపై వేయడంతో దుర్గంధం ఏర్పడుతుం ది.దీంతో పాటు అటు నుంచి వెళ్లే వాహన చోదకులకు అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు గ్రామ పం చాయతీకి సహకరిస్తూ తమ ఇండ్లలో చెత్తను చెత్త కుండీలో పెట్టుకుని ట్రాక్టర్‌లో వేయాలని గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు కోరారు.అదే విధంగా మిషన్ భగీరథ పైపు లైన్ లికేజి మరమ్మతు పనులు చేపట్టారు.

## దామరగిద్ద ఆర్టీఐ కమిటీ కొత్త కమిటీ నియామకం

**దామరగిద్ద, అక్టోబరు 3, ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల కమిటీలను శనివారం నియమించారు. పేట జిల్లా ఇంఛార్జి ఎడ్ల కూర్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కా ర్యక్రమానికి ఆర్టీఐ చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగండ్ల వెంకటేష్ ముది రాజ్ హాజరై జిల్లా ఉపాధ్యక్షుడిగా గణేష్‌ను నియమించారు. మండలఅధ్యక్షుడిగా భీమేష్ యాద వ్,ఉపాధ్యక్షుడిగా కనకప్ప యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మాణిక్యప్ప, యువజన విభాగం ఇంఛార్జిగా మొగులప్ప, సోషల్ మీడియా ఇంఛార్జిగా భరత్‌కుమార్, మండల కార్యదర్శిగా జగదీష్, కృష్ణ మాదిగను నియమించారు.

## అంగన్‌వాడీ టీచర్లకు ఘన సత్కారం

**కెటిదొడ్డి,అక్టోబర్3 ప్రభాతవార్త :** నరేంద్ర మోదీ 25ఏళ్ల రాజకీయ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా శనివారం కాలూరుతిమ్మన్‌దొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లను బీజేపీశ్రేణులు శాలువాతో ఘనంగా సత్కరించారు.మంచి అలవాట్లు నేర్పించే తొలిగురువులు అంగన్‌వాడీ టీచర్లేనని కొనియాడారు.కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారని,ప్రభుత్వ ఆరోగ్య,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు.ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు డి.వీరేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలి

**ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి**

**రైతులతో పైసలు వసూలు చేయకూడదు**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్, అక్టోబరు 3 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లాలో పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సీసీఐ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి సీసీఐ అధికారులు, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా, అగ్నిమాపక శాఖల అధికారులు, జిన్నింగ్ ప్రెస్సింగ్ మిల్లుల యజమానులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వ ప్రకటించిన కనీస మద్దతు ధర వివరాలను కలెక్టర్‌కు వివరించారు. లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ.8,667, మీడియం స్టేపుల్ పత్తికి రూ.8,267గా కనీస మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో లాంగ్ స్టేపుల్ పత్తికి ఉన్న రూ.8,110తో పోలిస్తే రూ.557 పెరుగుదల ఉందన్నారు. రైతులు కపాస్ కిసాన్ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే భారత పత్తి సంస్థ (సిసిఐ) నిబంధనల ప్రకారమే పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నట్లు సమావేశంలో చర్చించారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 2.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, సుమారు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ గణాంకాల ఆధారంగా అధికారులు తెలిపారు. జిల్లాలోని మొత్తం 19 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు కనీస మద్దతు ధరకు అనుగుణంగా పత్తి విక్రయించే అవకాశం కల్పించడంతో పాటు కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు. పత్తి నాణ్యత, తూకం, తేమ శాతం తదితర అంశాలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని, దళారులపై ఆధారపడకుండా అధికారిక కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పత్తి మార్కెటింగ్ సీజన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, రవాణా, అగ్నిమాపక, విద్యుత్, మార్కెటింగ్, వ్యవసాయ, న్యాయ కొలతల శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిన్నింగ్ మిల్లుల్లో అగ్నిప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, తూకం యంత్రాల ఖచ్చితత్వం తదితర అంశాలను సంబంధిత అధికారులు ముందుగానే పరిశీలించాలని తెలిపారు. పత్తి రైతులతో పత్తి మాత్రమే తీసుకోవాలని, హమాలీలు అని లేదా ఏ ఇతర అవసరమకైనా ఏ ఒక్క పత్తి రైతుతో డబ్బులు వసూలు చేసే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. జిన్నింగ్ మిల్లుల యజమానులు సమావేశంలో పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి బి. నాగేంద్ర, సీసీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనీషా, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ మహమ్మద్, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఏఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో మౌలిక వసతుల కల్పనకు తక్షణ చర్యలు

**విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా**

**అవసరమైన పనులు చేపట్టాలి : జిల్లా కలెక్టర్**

**సాంఘిక సంక్షేమ గురుకులంను క్షేత్రస్థాయి పరిశీలన**



సాంఘిక సంక్షేమ గురుకులంను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్

**లింగాల,అక్టోబరు 3 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన లింగాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను శనివారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురుకుల విద్యాలయ ప్రాంగణంలో జేసీబీ సహాయంతో చేపడుతున్న పరిసరాల శుభ్రత పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వసతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, టాయిలెట్లు, భవనాల పరిస్థితి తదితర మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలోని టాయిలెట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు పాత భవనాలకు పెయింటింగ్ వేయించాలని, అవసరమైన చోట్ల భవనాల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలోవిద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం అధికారుల బాధ్యత కలెక్టర్ పేర్కొన్నారు. గురుకులంలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను మెరుగుపరచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేష్, లింగాల గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మ, బుడ్డయ్య సంబంధిత అధికారులు ఉన్నారు.

## వాడి, వేడిగా మండల స్థాయి సమీక్ష సమావేశం



మండల స్థాయి సమీక్ష సమావేశం

**బాలానగర్,అక్టోబరు3 ప్రభాతవార్త:**బాలానగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం వాడి వేడిగా సాగింది. వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బాలానగర్ సర్పంచ్ గుమ్మళ్ల వెంకటేశ్వర్ రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న పంట నమోదు ప్రక్రియలో తప్పులు చోటుచేసుకుంటున్నాయని వ్యవసాయ శాఖ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై వ్యవసాయ అధికారిని సుజాత స్పందిస్తూ.. పంట నమోదు ప్రక్రియలో తప్పులు జరిగింది వాస్తవమేనని, సరి చేసి పంపిస్తామని హామీ ఇచ్చారు. పోచమ్మగడ్డ తండా, పెద్దాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శేరిగూడలో విద్యుత్ లైన్ మార్చాలని సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ కుమార్ నాయక్, బి.గాయత్రి, ఏదుగుట్టల తండాలో బీటీ రోడ్లు ఏర్పాటు చేసి రహదారి సమస్యను తీర్చాలని సర్పంచ్ కవిత విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించని లబ్ధిదారుల స్థానంలో అర్హత ఉన్న వారికి అవకాశం కల్పించాలని పెద్ద రేవల్లి సర్పంచ్ శ్రీధర్ గౌడ్, నందారం సర్పంచ్ హరిసింగ్ కోరారు. బోడ జానంపేటలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ రాజేంద్ర ఠాకూర్ తెలిపారు. బిల్డింగ్ తండా గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ వాల్యనాయక్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ శంకర్, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ ఏవో సుజాత, మండల స్థాయి సంబంధిత శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అర్హులైన దివ్యాంగులకు చేయూత పింఛన్లు అందేలా చూడాలి

**పెద్దపాడు,వామనపల్లి గ్రామాల్లో పింఛన్ల ధ్రువీకరణ**

**ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్**



పింఛన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు

**గద్వాల అక్టోబర్ 3,ప్రభాతవార్త : అర్హులైన** దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు అధికారులను ఆదేశించారు. ధరూర్ మండలంలోని పెద్దపాడు, వామనపల్లి గ్రామాల్లో శనివారం అదనపు కలెక్టర్ నర్సింగ రావు చేయూత దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధ్రువీకరణ సందర్భంగా దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన వివరాలు, ధ్రువపత్రాలు తదితర అంశాలను పరిశీలించి,అర్హతకలిగిన లబ్ధిదారుల వివరాలను నిబంధనల మేరకు నమోదుచేయాలని అధికారులకు సూచించారు.అర్హత కలిగిన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ ప్రయోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ధ్రువీకరణ పూర్తయిన అనంతరం వివరాలను సంబంధిత రికార్డుల్లో సక్రమంగా నమోదు చేసి,డేటాను ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమపథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమోహన్,ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు,సంబంధిత అధికారులు,సిబ్బంది మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్‌పై ఆర్యవైశ్యుల ఆగ్రహం..

**మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని నిరసన**

**కులం పేరుతో దూషించారని ఆరోపణ..**

**బహిరంగ క్షమాపణలకు డిమాండ్**

**ఎడ్మ సత్యం దిష్టిబొమ్మ దగ్ధం.. పోలీసులకు ఫిర్యాదు**



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి,అక్టోబర్3 ప్రభాతవార్త:**ఆర్యవైశ్యుల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంపై ఆర్యవైశ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కులంపేరుతో అసభ్యపదజాలంతో దూషించారని ఆరోపిస్తూ సత్యం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కల్వకుర్తిలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి ఆర్యవైశ్యులు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంపై ఫిర్యాదు చేశారు.ఎస్ఐ కురుమూర్తికి ఫిర్యాదు పత్రం అందజేసి,కులం పేరుతో దూషించిన సత్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం పాలమూరుచౌరస్తాలో ఎడ్మసత్యం దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు.ఈసందర్భంగా మాజీ జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు బచ్చురామకృష్ణ,కౌన్సిలర్ మెడికల్ రాములు మాట్లాడుతూ తమ సామాజికవర్గ మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని,భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాచేపల్లి శ్రీనివాస్,గంధం ప్రసాద్, వాసా శేఖర్,గోవింద్ శ్రీనివాసులు, గంప శ్రీనివాస్, గోవింద్ శ్రీనివాసులు, శ్రీధర్,కృష్ణయ్య, రవి, నరసింహ, బొమ్ము ఆంజనేయులు, ప్రసాద్, పూరి రమేష్, యువకులు, మహిళలు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

## బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా వెంకటేష్



వెంకటేష్‌ను శాలువాతో సన్మానిస్తున్న యాట రామకృష్ణ

**జడ్చర్ల అక్టోబర్ 3,ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ జడ్చర్ల మండల శాఖ బీజేవైఎం పాలమూరుజిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన బాదనమోని వెంకటేష్ ముదిరాజ్‌కి హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో మండల అధ్యక్షులు యాట రామకృష్ణ ముదిరాజ్ సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పి జగదీశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి చక్కని మల్లేష్ యాదవ్, మండల గిరిజన మోర్చా అధ్యక్షులు మోహన్ నాయక్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బరిగల శ్రీశైలం ముదిరాజ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు శివకుమార్‌యాదవ్,మండల నాయకులు ధనుంజయ్, జీవన్, తిరుపతి, వెంకటేష్, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఏ-1 జవాబు పత్రాల మూల్యాంకనంపై పరిశీలన

**మద్దూరు,అక్టోబరు 3 ప్రభాతవార్త :** మద్దూరు ప్రభుత్వ ఉర్దూ మీడియం హైస్కూల్‌లో జరుగుతున్న ఎస్ఏ-1 జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఎంఈఓ జనార్దన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. బాహ్య,సహాయ పరీక్షకులు చేపడుతున్న మూల్యాంకన తీరును పరిశీలించి, నిబంధనలు, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేయాలని సూచించారు.

## ఓటు నమోదు చేసుకోవాలి

**మద్దూరు,అక్టోబరు3 ప్రభాతవార్త :**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహేష్ గౌడ్ సూచించారు. గుర్తింపుపొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగిన వారు నవంబర్ 6వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

## కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆరా



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట,అక్టోబరు3 ప్రభాతవార్త:** మార్నింగ్ వాక్‌లో భాగంగా పట్టణంలో రాంనగర్ కాలనీలో సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. శనివారం ఉదయం రాంనగర్‌కాలనీలో వివిధశాఖల అధికారులతో కలిసి పర్యటించి సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు,రహదారులు,తాగునీరు,డ్రైనేజీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాలనీవాసులు తెలిపిన సమస్యలను సంబంధిత మున్సిపల్ అధికారులు కమిషనర్ మురళి, వార్డ్ ఆఫీసర్‌కి వెంటనే సమస్యను తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళి, నాయకులు, కార్యకర్తలు, వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## వానాకాలం 2026 వరి ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ కార్యక్రమం..

**గోపాల్‌పేట్, అక్టోబరు 3 ప్రభాతవార్త :** వానాకాలం 2026 వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ,జిల్లాపౌరసరఫరాలశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గోపాల్‌పేట్ రైతువేదికలో పీఏసీఎస్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి బి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు సూచించారు.

## అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

**వడ్డేపల్లి అక్టోబర్ 3, ప్రభాతవార్త :** వడ్డేపల్లి, మండల పరిధిలోని రైతులకు యాసంగి సీజన్‌కు అందుబాటులో సబ్సిడీ విత్తనాలు యాసంగి సీజన్లో రైతులు పంటలు సాగు చేసేందుకు సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వడ్డేపల్లి ఏవో జే రాధ. శనివారం పేర్కొన్నారు. పప్పు శనగ, జొన్న, మినుములు, మొక్కజొన్నవిత్తనాలు ఉన్నాయని తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాస్‌బుక్ ఆధార్‌కార్డు రైతు రిజిస్ట్రేషన్ ఐడి కార్డుతో సంబంధిత ఏఈఓలను సంప్రదించాలన్నారు. విత్తనాల నిల్వలు పరిమితంగా ఉన్నందున వెంటనే కొనుగోలు చేయాలన్నారు.

## శ్రీలక్ష్మీనరసింహస్వామికి మేఘారెడ్డి ప్రత్యేక పూజలు

◆ కుటుంబ సమేతంగా సింగోటం ఆలయ సందర్శన





శ్రీ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

**వనపర్తి, అక్టోబరు 3 ప్రభాతవార్త :** సింగోటం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణపక్ష అష్టమి, ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా సతీమణి శారదారెడ్డి, కుమారుడు నవనీత్‌రెడ్డితో కలిసి తమ ఇంటి దైవమైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కుటుంబానికి వేద బ్రాహ్మణులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలోనూ ప్రత్యేక అర్చనలు జరిపారు. వేద బ్రాహ్మణులు ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి కృపతో వనపర్తి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆకాంక్షించారు.

## కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ కర్రోళ్ళ స్వప్న

**గోపాల్ పేట, అక్టోబరు 3 ప్రభాతవార్త :** ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గోపాలపేట మండల ప్రజల కోసం అక్టోబర్ 4న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కర్రోళ్ళ స్వప్న భాస్కర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రచ్చకట్ట గాంధీ విగ్రహం వద్ద శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

## బోరు మోటర్ కోసం బావిలోకి దిగి రైతు మృతి

**పెబ్బేరు, అక్టోబరు 3 ప్రభాతవార్త :** వ్యవసాయ బావి దగ్గర ఏర్పాటు చేసిన మోటర్ బావిలో పడడంతో దాన్ని తీసేందుకు వెళ్లిన రైతు బావిలో మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం బూడిదపాడు గ్రామంలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన బోయ మండ్ల వెంకటయ్య 50 సంవత్సరాలు అనే రైతు తన వ్యవసాయ పొలంలోని బావి దగ్గర ఏర్పాటు చేసిన బోరు మోటర్ బావిలో పడిపోవడంతో దాన్ని బయటకు తీసేందుకు బావిలోకి దిగారు. బావిలో నీరు ఎక్కువగా ఉండటం తో రెండు సార్లు బావిలో మునిగి మోటర్‌ను గుర్తించారు. మూడోసారి తాడు తీసుకుని మోటారుకు కట్టి బయటకు తీద్దామని బావిలో మునిగిన వెంకటయ్య ఊపిరి పట్టలేక బయటికి రాలేదు. విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు బావిలోకి దిగి మృతదేహాన్ని బయటకు తీశారు.108 అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన రైతుకు భార్య ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు గత మూడు సంవత్సరాల క్రితం 30.9.23 లో వినాయక నిమజ్జనం సందర్భంగా బీచుపల్లి కి పోయి వస్తుండగా రంగాపురం వద్ద అనుమానాస్పదంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం మృతదేహాన్నికుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతి చెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బూడిదపాడు సర్పంచ్ గూడెం మన్యం గ్రామస్తులు తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

## లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తున్న దృశ్యం

**పెబ్బేరు, అక్టోబరు 3 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్హులందరికీ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని తోమాలపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ గుడిసె అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. గ్రామంలోని లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కొత్త రేషన్ కార్డులు పంపిణీపై గ్రామస్తులు సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి. వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డికి. కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ రాఘవేంద్ర, జిపిఓ పరమేశ్వర్, గ్రామఉపసర్పంచ్ గుడిసె రాంబాబు, వార్డు సభ్యులు ఉమేష్‌గౌడ్, లక్ష్మి, ఘట్టమ్మ, మాజీసర్పంచ్ సురేందర్‌గౌడ్, మాజీ ఎంపిటిసి మన్నెం, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు బోరింగ్ శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల మహిళలకు పుస్తక నిర్వహణపై శిక్షణ



స్వయం సంఘాల మహిళలకు పుస్తక నిర్వహణపై శిక్షణ ఇస్తున్న అధికారులు

**దామరగిద్ద, అక్టోబరు3 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం విట్లాపూర్ గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పంచసూత్రాలు, పుస్తకాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని సీఆర్‌పీలు నిర్వహించారు. సంఘాల కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు లెక్కల నమోదులో పాటించాల్సిన విధానాలపై మహిళలకు అవగాహన కల్పించారు. సంఘాల పొదుపులు, రుణాలు, విరాళాలు తదితర ఆర్థిక లావాదేవీలను పుస్తకాల్లో సక్రమంగా నమోదుచేయడం, లెక్కలను పారదర్శకంగా నిర్వహించడం వంటి అంశాలనువివరించారు. అలాగేబ్యాంకు లింకేజీ, నాయకత్వ మార్పిడి (లీడర్‌షిప్ రొటేషన్), సంఘాల బాధ్యతలు, విధులపై శిక్షణ ఇచ్చారు. సంఘాల ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం ద్వారా సభ్యులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది ఏపీఎం అంజలయ్య, సీసీ అంజిలప్ప, వీఓఏలు నరేష్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, వీఓ ఓబేలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సర్ పేరుతో ఓట్ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో అఖిలపక్ష పార్టీల నాయకులు సిపిఐ పట్టణ సెక్రెటరీ రమేష్, సిపిఎం జిల్లా సెక్రెటరీ పుట్ట ఆంజనేయులు, జబ్బార్, డి. కురుమయ్య, ఎంఐఎం జిల్లాఅధ్యక్షులు రహీం, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు ఖాదర్ బాషా, బాబుగౌడు, గణేష్, మండ్లరాజు, కాంగ్రెస్‌పార్టీ జిల్లాఉపాధ్యక్షులు తిరుపతయ్య ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, కోళ్ల వెంకటేష్, బి. కృష్ణ, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి పెద్దపీట

● మహిళల సౌకర్యాల కోసం మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ యెన్నం చిత్రంలో మేయర్, డిప్యూటీ మేయర్, ముడా చైర్మన్

**మహబూబ్‌నగర్, అక్టోబరు3, ప్రభాతవార్త :** మహిళల ఆత్మగౌరవం, ఐక్యతకు ప్రతీకగా నిర్మించిన ఈ భవనాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మర్లు ప్రాంతంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఎస్డీఎఫ్, ముడా, మున్సిపల్ నిధులు రూ.65 లక్షలతో నిర్మించిన మహిళల సమాఖ్య భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నగరంలోని వివిధ వార్డులు, కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో మర్లు ప్రాంతంలోని పలు కాలనీలకు సరైన రహదారి సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాను బాధ్యతలు చేపట్టిన రెండున్నర ఏళ్లలోనే సుమారు రూ.100 కోట్లతో నగరంలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ. 603 కోట్ల భారీ నిధులతో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ)పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అలాగే నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.220 కోట్లతో 14 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి ఎస్డీఎఫ్ ముడా మున్సిపల్ ద్వారా రూ.65 లక్షల నిధులు కేటాయించి నిర్మించామని గుర్తు చేశారు. మహిళా సమాఖ్య భవనానికి అదనంగా వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, కార్పొరేటర్లు సువర్ణ కిషన్‌నాయక్, గుముడాల రాధ గోవర్ధన్ గౌడ్, సిబి పూజిత, సల్మాన్, రఘు, తాహెర్, నాయకులు గంగిరెడ్డి, కంచి లక్ష్మణ్, చంద్రమౌళి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజుల రెడ్డి పాల్గొన్నారు.

# కేజీబీవీలో వరస పంచాయితీలు

వంట మనుషులతో వాగ్వాదం

వంటలు చేయకపోవడంతో స్పృహతప్పి పడిపోయిన విద్యార్థులు

రేవల్లి ఆసుపత్రికి తరలింపు..చికిత్స పొందుతున్న విద్యార్థులు

రాత్రి సమయంలో కేజీబీవీ దగ్గర తల్లిదండ్రులు



విద్యార్థులతో మాట్లాడుతున్న జీ సీడీవో ఇందిరా

**రేవల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త:** రేవల్లి మండలంలోని కేజీబీవీలో ఈ మధ్యకాలంలో వరుసగా విద్యార్థులు ఇబ్బంది పడిన సంఘటనలు జరుగుతున్నాయివి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం కేజీబీవీలో వంట చేయడానికి వచ్చిన వంట మనుషులు వంట సామాగ్రి వారి ఇంటికి తీసుకెళ్తున్నారని తెలుసుకున్న విద్యార్థులు శనివారం వంట మనుషులతో వాగ్వాదానికి దిగారు. దానితో కేజీబీవీ లో వంట చేస్తున్న పనివారు మధ్యాహ్నం విద్యార్థులకు వంట చేయకుండా ఇంటికి వెళ్ళిపోయారు. స్థానిక ఎంపీడీవో కీర్తన, తహసిల్దార్ సరస్వతి, వంట మనుషులతో మాట్లాడి మళ్ళీ తీసుకెళ్లి వారితో వంట చేయించారు. కానీ అప్పటికే కేజీబీవీ లోని నలుగురు విద్యార్థులు నీరసంతో స్పృహ తప్పి పడిపోయారు. విద్యార్థులను వెంటనే రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న జిసిడివో ఇందిరా, మండల విద్యాధికారి ఎంఈఓ వరప్రసాద్ రావు, ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. చికిత్స అనంతరం కేజీబీవీకి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న పరిస్థితులపై విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులకు వంట మనుషులను హెచ్చరించారు. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కేజీబీవీ దగ్గరికి చేరుకోవడంతో దాదాపు రాత్రి 8 గంటల వరకు కేజీబీవీ దగ్గర తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు వాల వేడి చర్చ కొనసాగింది. మండలంలోని పలు రాజకీయ పార్టీల నేతలు అక్కడికి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం బీఆర్ఎస్ ,కాంగ్రెస్ కొంత మాటల యుద్ధం నెలకొంది. మండల పోలీసులు ఎస్ఐ రజిత కేజీబీవీ దగ్గరికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి పరిస్థితులను అదుపు చేశారు. జిసిడిఓ ఉపాధ్యాయులకు, స్పెషల్ ఆఫీసర్ జ్యోతి కి పలు సూచనలు ఇచ్చి ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా చూసుకోవాలని విద్యార్థులకు ఏ ఇబ్బంది కలగకుండా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరస్వతి, ఎంపీడీవో కీర్తన, ఎంఈఓ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు పార్టీ నేతల చేతికి.. ?

సర్పంచులు, కార్యదర్శులకు ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలకు అప్పగింతపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం



అభ్యంతరం వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**మద్దూరు, అక్టోబరు 3 ప్రభాతవార్త:** మద్దూరు మండలంలోని పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల సాంక్షన్ ప్రొసీడింగ్స్‌ను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకుల ద్వారా పంపిణీ చేయిస్తున్నారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పార్టీ నాయకుల ద్వారా పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని, సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంచర్ల గోపాల్, నెల్లి రాములు, సర్పంచులు సాయిలు, సత్తెమ్మ రాజుగౌడ్, నవిత భీములు, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖలో దరఖాస్తుల ఆహ్వానం

24 పీఎం శ్రీపాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ల నియామకం

ఈనెల 8 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు : డీఈవో విజయ కుమారి



**మహబూబ్ నగర్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** జిల్లాలోని 24 పిఎం శ్రీ సెకండరీ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మెరుగైన విద్యా సేవలుఅందించేందుకు గెస్ట్ స్పెషల్‌నీడ్స్ ఎడ్యుకేటర్లను తాత్కాలిక ప్రాతిపదికననియమించనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి తెలిపారు. రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు ఐదు నెలలపాటు ప్రతిపాఠశాలకు ఒకరిచొప్పున నియామకం చేపట్టనున్నారు.

**అర్హతలు:** బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, బీఈడీ, జనరల్ తో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్ డిప్లొమా / పీజీ డిప్లొమా కలిగిన అభ్యర్థులు అర్హులు. స్థానికులకు గ్రామం, మండలం, జిల్లా ప్రాతిపదికన ప్రాధాన్యత ఇస్తారు. నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లిస్తారు.

**జిల్లాలో ఎంపికైన 24 పాఠశాలలు ఇవే :** కేజీబీవీ చిన్నచింతకుంట, టీజీఎస్ డబ్ల్యూ ఆర్ఈఐ ఎస్ రాంరెడ్డిగూడెం, కేజీబీవీ భూత్పూర్, టిజి ఆర్ఈఐఎస్ బాలానగర్, టిజిఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్ చిట్టబోయినపల్లి, జడ్‌పిహెచ్‌ఎస్ కోయిలకొండ, గార్లపాడ్, వెన్నచేడ్, గండీడ్, గుండ్యాల, గాజులపేట, దేవరకద్ర (బాలికలు), కౌకుంట్ల, అడ్డకల్, వేముల, జడ్‌పిహెచ్‌ఎస్ భూత్పూర్, తాటికొండ, బోయపల్లి, ప్రభుత్వ హైస్కూల్ షాషాబ్ గుట్ట, నవాబ్ పేట, రాజాపూర్, జడ్చర్ల (కేవీపీటీ రోడ్), బాదేపల్లి(బాలురు), వస్తుల లో పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి 8వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సూచించారు.

# 24 గంటల్లోనే తాగునీటి సమస్యకు పరిష్కారం

● యువ నాయకుడు జర్పుల భాస్కర్ నాయక్ చొరవ



5వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న యువ నాయకుడు జర్పుల భాస్కర్ నాయక్



బోరు వేయించి నీటి సమస్యను పరిష్కరించిన దృశ్యం

**జడ్చర్ల, అక్టోబరు 3, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ 5వ వార్డు నిమ్మబావిగడ్డ ఎర్రగుట్ట కాలనీలోని హనుమాన్ దేవాలయాన్ని శనివారం యువ నేత జర్పుల భాస్కర్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. కేవలం 24 గంటల్లోనే బోరు వేయించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాదు, వాటికి తక్షణ పరిష్కారం చూపించడమే తన లక్ష్యమని భాస్కర్ నాయక్ తెలిపారు. ఆయన చొరవతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎంబీ మెడికల్ సెంటర్ భూములను పరిరక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

అందువల్ల ఇది కేవలం ఒక వ్యక్తికి లేదా ఒక కుటుంబానికి సంబంధించిన ఆస్తిగా మాత్రమే చూడకూడదని, ఈ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా వైద్యసేవలు పొందిన వేలాది మంది ప్రజలకు ఈ సంస్థతో భావోద్వేగ అనుబంధం ఉందని తెలిపారు. రియల్ ఎస్టేట్ అంశంగా చూడొద్దు ఎంబీ మెడికల్ సెంటర్ భూముల వ్యవహారాన్ని కేవలం రియల్ ఎస్టేట్ వివాదంగా చూడటం సరికాదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సంస్థ చరిత్ర, ప్రజలకు అందించిన వైద్యసేవలు, సమాజంతో ఉన్న అనుబంధాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కోర్టుల్లో వివిధ కేసులు, ఉత్తర్వులు ఉన్న నేపథ్యంలో వాటినిచట్టబద్ధంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో కోర్టుల నుంచి వచ్చిన ఆదేశాల అమలుపై కూడా అనేక సందర్భాల్లో ప్రశ్నలు తలెత్తాయని, ఈ వ్యవహారంలో మాత్రం న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసుల పాత్రపై స్పష్టత అవసరం భూముల వివాదంలో పోలీసుల పాత్రపై కూడా స్పష్టత అవసరమని ఆయన అన్నారు. అన్ని వర్గాల వాదనలు, కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ రికార్డులను పరిశీలించిన తర్వాతే చర్యలు చేపట్టాలని కోరారు. ఏ ఒక్క వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన కలగకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంబీ మెడికల్ సెంటర్, హాస్పిటల్, సంబంధిత సొసైటీకి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు తమ పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వివాదాన్నిసామరస్య పూర్వకంగా, న్యాయ బద్ధంగా పరిష్కరించి, సంస్థకు సంబంధించిన సేవా లక్ష్యాలు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పశు వైద్య శిబిరం విజయవంతం



పశువులకు గర్భకోశ చికిత్స నిర్వహిస్తున్న పశు వైద్య అధికారి డా. ప్రవీణ్ కుమార్

**ఉప్పునుంతల, అక్టోబరు3 ప్రభాతవార్త:** మండలంలోని జప్తి సదగోడు గ్రామంలో శనివారం పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఉప్పునుంతల పశు సంవర్ధక శాఖ అధికారి డా. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గెల్వమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ శిబిరంలో డా. ప్రవీణ్ కుమార్ పాడి రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ విబిజి రామ్ జి పథకంలో భాగంగా పశువుల షెడ్, గొర్రెలు, మేకల షెడ్, పౌల్ట్రీ షెడ్ ఆజోలా పిట్ నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా తక్కువ వడ్డీ రేటుతో పాడి పశువుల పశుగ్రాస కొనుగోలు, దాణా కొనుగోలు కోసం బ్యాంకు వారి ఆర్థిక సహకారం పొందవచ్చు అని పశు వైద్య అధికారి డా. ప్రవీణ్ కుమార్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్‌తో పాటుగోపాలమిత్ర సూపర్‌వైజర్ గట్టు మురళీధర్‌రెడ్డి, గోపాల మిత్రులు అంజయ్య, శ్రీనివాసులు, తిరుపతయ్య, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

## భూ సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతు ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించినట్లు తహశీల్దార్ తెలిపారు. 1954-55 ఖస్రా పహాణీ ప్రకారంసర్వే నంబర్ 211లో మొత్తం 18.39 ఎకరాల పట్టా భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉండగా, టిప్పన్ ఆధారంగా నిర్వ హించిన క్షేత్రస్థాయి పరిశీలనలో 17.39 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన భౌతిక స్వాధీన అంశంపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సర్వే నంబర్‌లో పేర్కొన్న భూమికి మృతుడికి ఎటువంటి సంబంధం లేదని తహశీల్దార్ వివరించారు. మృతుడి కుటుంబ వివరాలు విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం మృతుడు పసుల లావప్ప పార్పల్లి గ్రామానికి చెందినవారని, ఆయనకు కనకమ్మ, మంజుల అనే ఇద్దరు భార్యలు మృతి చెందినట్లు తహశీల్దార్ తెలిపారు. వేణుగోపాల్, కుర్మయ్య, గంగాధర్ అనే ముగ్గురు కుమారులు, నాగేశ్వరమ్మ అనే కుమార్తె ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తహశీల్దార్ దీపక్‌రావు తెలిపారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, పోస్టుమార్టం నివేదిక, రెవెన్యూ రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.




## మహబూబ్‌నగర్ రూపురేఖలు మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నగరంలో సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి డివిజన్‌ను సమానంగా అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరువంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని, అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, స్థానిక కార్పొరేటర్లు అనుప ఆంజనేయులు, లలితా భానుచందర్, పెద్ద గొల్ల నర్సింహులు, రామస్వామి, గుముడాల రాధ గోవర్ధన్ గౌడ్, పాండురంగా రెడ్డి, తాహేర్, ఫక్రు ఖురేషి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సిరిగిరి మురళి, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు : మంత్రి జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం...** గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. కొల్లాపూర్‌లో నిర్మించనున్న నూతన ఎస్టీ బాలుర వసతిగృహం అందుబాటులోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కలగనున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో మెరుగైన ఆదాయం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై జరిగిన కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం వీరాంజపల్లి గ్రామంలో సెంట్రల్ కిచెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటల సాగు, పెంపకానికి అనువైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో సెంట్రల్ కిచెన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను స్థానికంగా సాగు చేసి వినియోగించుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, అచ్చంపేట డివిజన్ వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, తహసిల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో రేవతిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జెన్‌జీ ఉద్యమాలలో భాగస్వాములు కావాలి

(మొదటి పేజీ తరువాయి)



రాజకీయాలను సంపూర్ణంగా శుద్ధి చేయాలంటే విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. అంతకుముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర రాజకీయాలపై విద్యార్థిని విద్యార్థులతో తీన్మార్ మల్లన్న దాదాపు గంటసేపు విశేషంగా పలు విషయాలపై చర్చించడం విద్యార్థిని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిక్షనరీ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్నతో పాటుగా టీఆర్పీ పార్టీకి సంబంధించిన కార్యకర్తలు, నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.